ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
అల్లూరి సీతారామరాజు జిల్లా వార్తలు
మంగళవారం 16 ఏప్రిల్ 2024



సరిహద్దు గ్రామాల్లో హెలికాప్టర్ చక్కర్లు

ముంచంగిపుట్టు, ఏప్రిల్ 15: మండలంలో గల ఆంధ్రా, ఒడిశా సరిహద్దు గ్రామాల్లో సోమవారం ఓ హెలికాప్టర్ చక్కర్లు కొట్టింది. ముంచంగిపుట్టుతో పాటు మారుమూల గ్రామాలైన రంగబయలు, బూసిపుట్టు, బుంగాపుట్టు తదితర గ్రామాల మీదుగా హెలికాప్టర్ వెళ్లింది. సార్వత్రిక ఎన్నికలు సమీపించడం, మావోయిస్టులు మూడు రోజుల పాటు బంద్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో మారుమూల గ్రామాలకు అతి సమీపంలో హెలికాప్టర్ వెళ్లినట్టు తెలిసింది. అయితే ఏం జరుగుతుందో తెలియక గిరిజనులు భయాందోళనకు గురయ్యారు.

అప్పు చేసి రోగులకు భోజనాలు



- 11 నెలలుగా కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించని వైసీపీ ప్రభుత్వం
- ఆర్థిక ఇబ్బందులతో ప్రైవేటు ఏజెన్సీల నిర్వాహకులు సతమతం
- బిల్లులు మంజూరు చేయకపోతే ప్రభుత్వ ఆస్పత్రుల్లో భోజనాలు నిలిపివేస్తామని హెచ్చరిక



చింతపల్లి ఏరియా ఆస్పత్రిలో భోజనం కోసం బారులుతీరిన రోగుల సహాయకులు

చింతపల్లి, ఏప్రిల్ 15: ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులకు భోజనాలు సమకూర్చే కాంట్రాక్టర్లు(ప్రైవేటు ఏజెన్సీల నిర్వాహకులు) ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారు. గత 11 నెలలుగా వైసీపీ ప్రభుత్వం డైట్ బిల్లులు మంజూరు చేయకపోవడంతో అప్పులు చేసి రోగులకు భోజనాలు పెడుతున్నారు. ఇక తమ వల్ల కాదని, బిల్లులు మంజూరు చేయకపోతే భోజనాల సరఫరా నిలిపివేస్తామని కాంట్రాక్టర్లు చెబుతున్నారు.

పాడేరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని అరకు, చింతపల్లి ఏరియా ఆస్పత్రులు, ముంచంగిపుట్టు సామాజిక ఆరోగ్య కేంద్రం, పాడేరు జిల్లా ఆస్పత్రిలో ఇన్ పేషెంట్లు, సహాయకులకు భోజనాలు పెట్టే బాధ్యతలను ప్రభుత్వం ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించింది. ప్రైవేటు ఏజెన్సీలు ఏరియా, సామాజిక, జిల్లా ఆస్పత్రుల్లో రోగులు, సహాయకులకు భోజనాలు పెడుతున్నాయి. అయితే 2023 ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు డైట్ బిల్లులను వైసీపీ ప్రభుత్వం మంజూరు చేయలేదు. 15 రోజుల కిందట ఉమ్మడి జిల్లా కలెక్టర్ ఎ.మల్లికార్జునను కలిసి డైట్ బిల్లులు అందకపోవడం వల్ల రోగులకు భోజనాలు నిలిపివేస్తామని వినతి పత్రం అందజేయడంతో గత ఏడాది ఏప్రిల్ నెలకు సంబంధించిన డైట్ బిల్లు నిధులు మంజూరు చేశారు. ప్రస్తుతం గత ఏడాది నుంచి ఇప్పటి వరకు 11 నెలలకు సంబంధించిన డైట్ బిల్లులు కాంట్రాక్టర్లకు అందాల్సి వున్నది.

అప్పుల పాలవుతున్న కాంట్రాక్టర్లు

వైసీపీ ప్రభుత్వం పదకొండు నెలలుగా డైట్ బిల్లులు చెల్లించకపోవడం వల్ల అప్పులు చేసి రోగులకు భోజనాలు పెడుతున్నామని కాంట్రాక్టర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గిరిజన ప్రాంతానికి చెందిన ఏరియా, సామాజిక, జిల్లా ఆస్పత్రుల్లో ఇన్ పేషెంట్లు, సహాయకులకు ప్రైవేటు ఏజెన్సీల ద్వారా భోజనాలు పెడుతున్నారు. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనాలు పెట్టాలి. మధ్యాహ్నం, రాత్రి భోజనంలో కచ్చితంగా గుడ్డు, అరటి పండు, మజ్జిగ, కూర, సాంబారు, రసం ఉండాలి. రోగి, సహాయకుడికి రోజుకి రూ.80 చొప్పున చెల్లించేందుకు ప్రభుత్వం అంగీకరించింది. అయితే ఏడాది బకాయి బిల్లులు చెల్లించాల్సి ఉన్నప్పటికీ గత నెలలో కేవలం ఒక నెలకు సంబంధించిన బిల్లు మాత్రమే విడుదల చేయడంతో కాంట్రాక్టర్లు తీవ్ర అవసహనం వ్యక్తం చేస్తున్నారు. రోగులకు భోజనాలు పెట్టేందుకు అప్పులపాలైపోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆస్పత్రులకు రోగుల తాకిడి

అరకు, చింతపల్లి ఏరియా ఆస్పత్రులు, ముంచంగిపుట్టు సామాజిక ఆరోగ్య కేంద్రం, పాడేరు జిల్లా ఆస్పత్రులకు రోగుల తాకిడి భారీగా పెరిగింది. ఆస్పత్రుల్లో ఇన్‌పేషెంట్లుగా చికిత్స పొందే రోగుల సంఖ్య అధికమైంది. పాడేరు జిల్లా ఆస్పత్రిలో ప్రతి రోజు 180- 200 మంది, అరకులోయ ఏరియా ఆస్పత్రిలో 50- 60, చింతపల్లి ఏరియా ... మిగతా 8వ పేజీలో

ప్రభుత్వం తక్షణమే బకాయి బిల్లులు చెల్లించాలి



ప్రభుత్వం 11 నెలల బిల్లులు చెల్లించకపోవడం వల్ల అప్పులు చేసి రోగులకు భోజనాలు పెడుతున్నాం. కిరాణా, కూరగాయాల దుకాణాల్లో బకాయిలు పెరిగిపోవడంతో అప్పు పుట్టడం లేదు. మరో ఐదు రోజుల్లో ప్రభుత్వం డైట్ బిల్లులు విడుదల చేయకపోతే రోగులకు భోజనాలు పెట్టే పరిస్థితి లేదు.

-టి.ఈశ్వరి, డైట్ కాంట్రాక్టర్, ఏరియా ఆస్పత్రి, అరకులోయ

బస్సెక్కితే బాదుడే

వైసీపీ పాలనలో రెండుసార్లు ఆర్టీసీ చార్జీల పెంపు



- 25 నుంచి 50 శాతం మేర వడ్డించిన సర్కారు
- పేద, మధ్యతరగతి ప్రజలపై తీవ్ర ప్రభావం
- ఉమ్మడి జిల్లాలోని ప్రయాణికులపై నెలకు రూ.పది కోట్లు అదనపు భారం
- ఆక్యుపెన్సీ రేషియో తగ్గిందనే నెపంతో పలు ప్రాంతాలకు సర్వీసులు రద్దు
- వైసీపీ ప్రభుత్వ తీరుపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

పేద, మధ్య తరగతి ప్రజల చైతన్యరథంగా పేరొందిన ఆర్టీసీ(పీటీడీ) బస్సుల్లో ప్రయాణం భారంగా మారింది. వైసీపీ అధికారం చేపట్టిన ఐదేళ్లలో రెండుసార్లు భారీగా టికెట్ చార్జీలను పెంచడంతో ఉమ్మడి విశాఖ జిల్లాలోని ప్రయాణికులపై నెలకు సుమారు రూ.10 కోట్లు అదనపు భారం పడింది. 2019లో పోల్చితే సిటీ బస్సుల నుంచి లగ్జరీ ఎక్స్‌ప్రెస్‌ల వరకు బస్సు టికెట్‌ల ధరలను 25 శాతం నుంచి 50 శాతం వరకూ పెంచేయడంతో సగటు ప్రయాణికులు గగ్గోలు పెడుతున్నారు. ఈ నేపథ్యంలో వైసీపీ ప్రభుత్వ తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

విశాఖ రీజియన్ ఉమ్మడి విశాఖ జిల్లా పరిధిలో సుమారు 1,063 బస్సు సర్వీసులు నడుస్తున్నాయి. 256 రూట్లలో ప్రతి రోజూ 3.5 లక్షల మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరుస్తున్నాయి. వీటి ద్వారా ఆర్టీసీకి రోజుకు సగటున రూ.1.35 కోట్ల ఆదాయం సమకూరుతోంది. రాష్ట్ర విభజన తరువాత టీడీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లలో ఆర్టీసీ చార్జీలను పెంచలేదు. కాగా 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఆర్టీసీని ఆదాయ వనరుగా మార్చేశారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో రెండు సార్లు భారీగా చార్జీలను పెంచింది. దీని వల్ల పేద, మధ్యతరగతి ప్రజలకు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం భారంగా పరిణమించింది. ఆదాయమే పరమావధిగా జగన్ ప్రభుత్వం చార్జీలను భారీగా పెంచడంతో వారిపై అదనపు భారం పడింది. విశాఖ పరిధిలోని వివిధ రూట్లలో తిరిగే సిటీ బస్సులతో పాటు ఉత్తరాంధ్రలోని వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రధాన రూట్లలో తిరిగే ఎక్స్‌ప్రెస్, లగ్జరీ బస్సుల చార్జీలను 2019తో పోల్చితే 25 శాతం నుంచి గరిష్ఠంగా 50 శాతం వరకూ పెంచారు.

విశాఖ నుంచి వివిధ ప్రాంతాలకు చార్జీల వివరాలు

ప్రాంతం	2019లో	2024లో
చోడవరం	రూ.55	రూ.75
నర్సీపట్నం	రూ.105	రూ.150
విజయనగరం	రూ.60	రూ.90
పార్వతీపురం	రూ.170	రూ.220
శ్రీకాకుళం	రూ.150	రూ.175
పాలకొండ	రూ.150	రూ.185
అనకాపల్లి	రూ.50	రూ.60
సబ్బవరం	రూ.30	రూ.40
కొత్తవలస	రూ.25	రూ.35
ఎలమంచిలి	రూ.60	రూ.85

ప్రయాణికులపై భారం ఇలా...

విశాఖ ద్వారకాబస్‌స్టేషన్ నుంచి చోడవరం ప్రయాణానికి 2019లో చార్జీ రూ.55 ఉండగా ఇప్పుడు రూ.75, నర్సీపట్నానికి 2019లో రూ.105 ఉండగా ప్రస్తుతం రూ.150, విజయనగరానికి 2019లో రూ.60 ఉంటే ప్రస్తుతం రూ.90, పార్వతీపురానికి రూ.170 ఉంటే ప్రస్తుతం 220, శ్రీకాకుళానికి రూ.150 ఉంటే ప్రస్తుతం 175, పాలకొండకి రూ.150 నుంచి రూ.185కి, అనకాపల్లికి రూ.50 నుంచి రూ.60, సబ్బవరం రూ.30 నుంచి రూ.40, కొత్తవలస రూ.25 నుంచి రూ.35, ఎలమంచిలి రూ.60 నుంచి రూ.85కి పెరిగిపోయాయి.

విశాఖ వాసులపైనా వడ్డన

విశాఖ పరిధిలో సింహాచలం వరకు 2019లో రూ.20 చార్జీ ఉండగా ... మిగతా 8వ పేజీలో

భారంగా బస్సు ప్రయాణం



టీడీపీ హయాంలో ఆర్టీసీ చార్జీలను పెంచలేదు. కానీ వైసీపీ అధికారంలోకి వచ్చాక రెండు సార్లు చార్జీలు పెంచింది. దీని వల్ల బస్సు ప్రయాణం భారంగా మారింది. అందువల్ల ప్రయాణాలు తగ్గించుకున్నాం.

-కాకురు చంద్రరావు, తోటలూరు, కొయ్యూరు మండలం

పల్లెల్లో దోమల మందు పిచికారీ

- జిల్లాలో తొలి విడతగా 1,767 గ్రామాల్లో స్ప్రేయింగ్ పనులు
- కలెక్టర్ ఎం.విజయసునీత



స్ప్రేయింగ్ జరుగుతున్న తీరును పరిశీలిస్తున్న కలెక్టర్ విజయసునీత

పాడేరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మలేరియా ప్రభావిత గ్రామాల్లో ముందస్తుగా దోమల మందు పిచికారీ పనులు చేపడతామని కలెక్టర్ ఎం.విజయసునీత తెలిపారు. మండలంలో చింతలవీధి పంచాయతీ ఉబ్బేటిపుట్టు గ్రామంలో సోమవారం ఆమె జెండా ఊపి స్ప్రేయింగ్ పనులను లాంఛనంగా ప్రారంభించి మాట్లాడారు. నిర్దేశించిన ప్రణాళిక ప్రకారం ఆయా గ్రామాల్లో దోమల నివారణ మందు పిచికారీ పనులు పూర్తి చేయాలని మలేరియా అధికారులు, సిబ్బందిని ఆదేశించారు.

అలాగే వైద్యులు, క్షేత్ర స్థాయి సిబ్బంది, మలేరియా సిబ్బంది సమన్వయంతో పని చేసి విజయవంతంగా పిచికారీ పనులు పూర్తి చేయాలన్నారు. మొదటి విడత స్ప్రేయింగ్ కార్యాచరణ ప్రకారం ఈ నెల 15 నుంచి 30వ తేదీ నాటికి జిల్లా వ్యాప్తంగా 62 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో 307 సచివాలయాలకు చెందిన 1,767 గ్రామాల్లో దోమల మందు పిచికారీ చేయాలన్నారు. లక్ష్యం మేరకు దోమల మందు పిచికారీ పనులు జరగాలని, అందుకు గ్రామస్థులు సహకరించాలని కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి టీఎస్ఎస్ ప్రసాద్, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ సాధన, మలేరియా సబ్ యూనిట్ అధికారులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చంద్రబాబు, పవన్ కల్యాణ్‌ల పర్యటన వాయిదా

అనకాపల్లి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌ల అనకాపల్లి జిల్లా పర్యటన వాయిదా పడింది. ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం మంగళవారం మధ్యాహ్నం మూడు గంటలకు చోడవరం, సాయంత్రం ఐదు గంటలకు ఎలమంచిలి నియోజకవర్గాల్లో కూటమి అభ్యర్థుల విజయం కోసం ఉమ్మడిగా ఎన్నికల ప్రచార సభలు నిర్వహించాల్సి వుంది. కానీ పవన్‌కల్యాణ్ కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో బీజేపీ ముఖ్యనేతలకు మద్దతుగా ఎన్నికల ప్రచారానికి వెళుతున్నందున మంగళవారం జిల్లాలోని చోడవరం, ఎలమంచిలి నియోజకవర్గాల్లో పర్యటన వాయిదా పడినట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. చంద్రబాబు, పవన్‌కల్యాణ్ పర్యటన మళ్లీ ఎప్పుడు అనేది త్వరలోనే ప్రకటిస్తామని పేర్కొన్నారు.

ఇద్దరు ఆశ్రమ పాఠశాల విద్యార్థులు అదృశ్యం 7

మన్యం భగభగ

- కొయ్యూరులో అత్యధికంగా 40.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు



పాడేరులో గొడుగులు వేసుకుని ఆస్పత్రికి వెళుతున్న నర్సింగ్ శిక్షణ అభ్యర్థులు

పాడేరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మన్యంలో ఎండల తీవ్రత కొనసాగుతున్నది. కొయ్యూరులో సోమవారం 40.6 డిగ్రీల సెల్సియస్ గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. ఏజెన్సీలో ఉదయం నుంచే ఎండ ప్రభావం మొదలై తొమ్మిది గంటల తరువాత నుంచి దాని తీవ్రత అధికమవుతున్నది. మధ్యాహ్నం వేళల్లో రోడ్లపై సంచరించేందుకు జనం ఇబ్బంది పడుతున్నారు. సాయంత్రం ఆరు గంటల నుంచి ఎండ ప్రభావం తగ్గుతున్నప్పటికీ ఉక్కపోత, వేడి వాతావరణం కొనసాగుతున్నది. తాజా వేడి వాతావరణానికి ఏజెన్సీ వాసులు సైతం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఎండల తీవ్రత పెరుగుతుందనే వాతావరణ శాఖ ప్రకటనలతో మన్యం వాసులు ఆందోళన చెందుతున్నారు. సోమవారం కొయ్యూరులో 40.6 డిగ్రీల సెల్సియస్ గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదుకాగా, అనంతగిరిలో 35.4, అరకులోయలో 35.4, చింతపల్లిలో 37.1, డుంబ్రిగుడలో 36.5, జీకేవీదిలో 38.8, జి.మాడుగులలో 37.5, హుకుంపేటలో 34.0, ముంచంగిపుట్టులో 36.6, పాడేరులో 37.6, పెదబయలులో 36.6 డిగ్రీల సెల్సియస్‌గా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.



నిర్మానుష్యంగా ఉన్న కొయ్యూరు మెయిన్ రోడ్డు

రహదారులు నిర్మానుష్యం

కొయ్యూరు: కొయ్యూరులో ఉదయం ఎనిమిది గంటల నుంచే ఎండ ప్రభావం చూపిస్తోంది. సాయంత్రం ఐదు గంటల వరకు ఎండ తీవ్రత కొనసాగుతున్నది. ఉదయం 11 గంటలు దాటిన తరువాత రోడ్లపైకి రావడానికి జనం భయపడుతున్నారు. మధ్యాహ్నం వేళ అన్ని రహదారులు నిర్మానుష్యంగా కనిపించాయి. ఎండ తీవ్రతతో పాటు వీస్తున్న వడగాడ్పులకు పూత, పిందెతో ఉన్న జీడిమామిడి తోటలు ఆకులు ఎండిపోతున్నాయి. పిందెలు రాలిపోతుండడంతో రైతాంగం నష్టపోతున్నది.

డిప్యూటీ సీఎంకు ఝలక్!

- సొంత మండలం దేవరాపల్లిలో 'కిలపర్తి' కుటుంబం తిరుగుబాటు
- భాస్కరరావు సతీమణి రాజేశ్వరి ఎంపీపీ పదవికి రాజీనామా
- మూడు వారాల ముందు నుంచే మంత్రితో కటీఫ్
- అనకాపల్లి ఎంపీ అభ్యర్థిగా ముత్యాలనాయుడు పేరును ప్రకటించిన వైసీపీ అధిష్ఠానం
- మాడుగుల ఎమ్మెల్యే టికెట్ ఆశించిన కిలపర్తి
- తన కుమార్తెకు టికెట్ ఇప్పించుకున్న డిప్యూటీ సీఎం
- అప్పటి నుంచి కిలపర్తి కుటుంబం అలక



జడ్పీ సీఈవో ఎం.పోలినాయుడుకు రాజీనామా పత్రం అందిస్తున్న దేవరాపల్లి ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి, పక్కన ఆమె భర్త భాస్కరరావు

దేవరాపల్లి, ఏప్రిల్ 15: సాధారణ ఎన్నికల ముందు మాడుగుల నియోజకవర్గంలో అధికార వైసీపీలో నెలకొన్న అంతర్గత విభేదాలు, అసంతృప్తి ఒక్కసారిగా బయటపడ్డాయి. ఉప ముఖ్యమంత్రి, వైసీపీ అనకాపల్లి పార్లమెంట్ అభ్యర్థి అయిన బూడి ముత్యాలనాయుడు సొంత మండలం దేవరాపల్లి మండల పరిషత్ అధ్యక్ష ... మిగతా 8వ పేజీలో



ఉచిత కోచింగ్ పొందుతున్న అభ్యర్థులనుద్దేశించి మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో అభిషేక్, పక్కన ఏటీడబ్ల్యూవో ఎల్.రజని

గ్రూప్-2 విజయమే లక్ష్యంగా కృషి చేయాలి

- శిక్షణ పొందుతున్న అభ్యర్థులతో ఐటీడీఏ పీవో అభిషేక్

పాడేరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): గ్రూప్- 2 మెయిన్స్‌లో విజయమే లక్ష్యంగా ప్రత్యేక దృష్టి పెట్టాలని అభ్యర్థులకు ఐటీడీఏ పీవో వి.అభిషేక్ సూచించారు. విశాఖపట్నం వేపగుంటలోని యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో ఉచిత సివిల్స్ శిక్షణ పొందుతున్న అభ్యర్థులతో సోమవారం ఆయన సమావేశమై మాట్లాడారు. బాగా సాధన చేసి ప్రభుత్వ కొలువులు సాధించాలన్నారు. అలాగే గ్రూపు-2లో విజయం సాధిస్తే గ్రూప్ -1 సాధిస్తామనే నమ్మకం పెరుగుతుందన్నారు. ఏపీపీఎస్సీ నిర్వహిస్తున్న పోటీ పరీక్షల్లో విజయం సాధిస్తే గిరిజన ప్రాంతానికి మేలు జరుగుతుందన్నారు. ఏజెన్సీలో వున్న మరింత మంది నిరుద్యోగులకు నమ్మకం పెరిగేలా పోటీ పరీక్షల్లో విజయం సాధించాలన్నారు.

పాడేరు ఐటీడీఏ పరిధిలో ఉన్న 117 గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లోని గిరిజన విద్యార్థులకు ఆదర్శంగా మీ ఫొటోలను చూపిస్తామన్నారు. మీరంతా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేశ్‌కుమార్ మీనాను ఆదర్శంగా తీసుకుని సివిల్స్‌లో విజయం సాధించాలన్నారు. ఆయన సివిల్స్ సాధించడంతో రాజస్థాన్‌లో మూడు జిల్లాలు ఎంతో అభివృద్ధి చెందాయన్నారు. అనంతరం పోటీ పరీక్షలకు శిక్షణ ... మిగతా 8వ పేజీలో

క్రైం... crime news

టెక్కలిపాలెంలో 138 మద్యం బాటిళ్లు స్వాధీనం



టెక్కలిపాలెంలో పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు

సబ్బవరం, ఏప్రిల్ 15: మండలంలోని టెక్కలిపాలెంలో అక్రమంగా విక్రయిస్తున్న 138 మద్యం బాటిళ్లను పోలీసులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. సీఐ పిన్నింటి రమణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మద్యం విక్రయిస్తున్న సమాచారం మేరకు టెక్కలిపాలెంలో దాడి చేయగా కె.దేముడుబాబు ఇంటి వద్ద మద్యం విక్రయిస్తుండగా సోమవారం సాయంత్రం 138 క్వార్టర్ మద్యం బాటిళ్లు పట్టుబడ్డాయన్నారు. వాటి విలువ సుమారు రూ. 21,150 ఉంటుందన్నారు. విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ రమణ తెలిపారు.

ఇద్దరు ఆశ్రమ పాఠశాల విద్యార్థులు అదృశ్యం



అదృశ్యమైన సాయి, దినేశ్ (ఫైల్)

చింతపల్లి, ఏప్రిల్ 15: మండలంలోని లంబసింగి గిరిజన సంక్షేమ శాఖ బాలుర ఆశ్రమ పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థులు అదృశ్యమయ్యారు. పాఠశాల వార్డెన్ ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు గాలింపు చర్యలు ప్రారంభించారు. దీనికి సంబంధించి పోలీసులు సోమవారం తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. లంబసింగి టీడబ్ల్యూ బాలుర ఆశ్రమ పాఠశాలలో చింతపల్లి మండలం బౌడ గ్రామానికి చెందిన పాంగి సాయి, గానుగుల గ్రామానికి చెందిన కిల్లో దినేశ్ ఏడో తరగతి చదువుతున్నారు. ఆ ఇద్దరు విద్యార్థులు శుక్రవారం ఉదయం తరగతులకు హాజరై, మధ్యాహ్నం భోజనం తరువాత పాఠశాల విడిచి వెళ్లిపోయారు. దీంతో పాఠశాల వార్డెన్ కొండలరావు చింతపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఉపాధ్యాయులు, పోలీసులు విద్యార్థుల ఆచూకీ కోసం గాలిస్తున్నారు. విద్యార్థుల ఆచూకీ తెలిసిన వారు 9440904238, 9440904239 నంబర్లకు ఫోన్ చేయాలని ఎస్ఐ అరుణ్ కిరణ్ కోరారు.

పీఆర్ గెస్టు హౌస్‌లో ప్రైవేటు వాహనాలు

- అసహనం వ్యక్తం చేసిన కలెక్టర్



పీఆర్ గెస్టు హౌస్ పోర్టుకోలో నిలిపిఉన్న ప్రైవేటు కార్లు

పాయకరావుపేట, ఏప్రిల్ 15: ప్రభుత్వ అతిథి గృహాల్లో ప్రైవేటు వాహనాలు నిలుపరాదన్న నిబంధన ఉన్నా పాయకరావుపేటలోని పంచాయతీరాజ్ శాఖ అతిథి గృహంలో మాత్రం అమలు కావడంలేదు. అతిథి గృహం ఆవరణలో కొంతకాలంగా ప్రైవేటు వాహనాలను నిలుపుతున్నారు. ఇక్కడే పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ డీఈ కార్యాలయం ఉన్నా పీఆర్ అధికారులు పట్టించుకోకపోవడం విశేషం. ఇదిలా ఉంటే సోమవారం పాయకరావుపేట వచ్చిన జిల్లా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి అతిథి గృహం పోర్టికోలో వాహనాలు నిలిపి ఉండడాన్ని గమనించారు. పోర్టికోలో ప్రైవేటు వాహనాలు నిలిపి ఉండడంపై స్థానిక అధికారులపై అసహనం వ్యక్తంచేసి వెంటనే వెనక్కి వెళ్లిపోయారు. సోమవారం పట్టణంలో ఓ ప్రైవేటు విద్యా సంస్థలో పీవోలు, ఏపీవోల శిక్షణ తరగతులను పరిశీలించేందుకు వచ్చిన కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి పరిశీలన అనంతరం పట్టణంలోని పీఆర్ గెస్టు హౌస్‌కి వచ్చారు. అ సమయంలో పలు కార్లు, వాహనాలు ఉండడంతో తీవ్ర అసహనానికి గురైన కలెక్టర్ వెంటనే వెళ్లిపోయారు. ఈ సందర్భంగా స్థానిక అధికారులతో ఫోన్‌లో మాట్లాడిన ఆయన ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది. ఆ వెంటనే గెస్టు హౌస్‌కి చేరుకున్న తహసీల్దారు సూర్యనారాయణ, ఎంపీడీఓ కె.స్వప్న, పంచాయతీ కార్యదర్శి జె.చంద్రశేఖర్ అతిథి గృహం ఆవరణలో వాహనాలు వెంటనే తొలగించాలని కిందిస్థాయి సిబ్బందిని ఆదేశించారు.

చిత్రలేఖనంలో గురుకుల విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

దేవరాపల్లి, ఏప్రిల్ 15: ఇక్కడి గురుకుల పాఠశాల విద్యార్థులు చిత్రలేఖనం పోటీల్లో అద్భుత ప్రతిభ చూపారు. గుంటూరు కేఎల్ యూనివర్సిటీలో జరిగిన ఆలిండియా యూత్ అండ్ చిల్డ్రన్స్ కాంపిటీషన్, ఎగ్జిబిషన్‌లో దేవరాపల్లి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులం విద్యార్థులు పాల్గొని ఏడు బంగారు పతకాలు, ఆలిండియా బాల చిత్రకళ అవార్డును సొంతం చేసుకున్నారు. ప్రతిభ చూపిన ఏడు, ఎనిమిది, తొమ్మిది తరగతుల విద్యార్థులు రవి, సుశాంత్, గౌతంబాబు, హరీష్, బాలాజీ, కిరణ్, నరసయ్య, ఆకర్షలతో పాటు ఆర్ట్ టీచర్ అర్జునరావును ప్రిన్సిపాల్ రవీంద్రనాథ్, పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ ఉల్లి శ్రీను, ఉపాధ్యాయులు సోమవారం అభినందించారు.

గిరి రైతు చింత!

- మాడుగుల వారపు సంతకు భారీగా కావిళ్లతో చింతపండు రాక
- కొనుగోలుదారులు లేక డీలా
- 30కిలోలు ఉన్న కావిడి గతవారం రూ.2400 వరకు విక్రయం
- ఈ వారం కేవలం రూ.1200లే పలకడంతో ఆవేదన



మాడుగుల వారపు సంతకు విక్రయానికి చింతపండును కావిళ్లతో తెచ్చిన గిరిజనులు

మాడుగుల, ఏప్రిల్ 15: సంతల్లో గత నాలుగైదు వారాలుగా మంచి ధర పలికిన చింతపండు ఈ వారం ఒక్కసారిగా తగ్గిపోయింది. దీంతో గిరిజన రైతులు డీలా పడగా, వ్యాపారులు ఉత్సాహంగా కనిపించారు. మాడుగులలో సోమవారం జరిగిన వారపు సంతకు ఏజెన్సీలోని గిరిజన గ్రామాలైన కక్కి, వంట్లమామిడి, ఈదులపాలెం, దేవాపురం, సలుగు, కందులపాలెం వంటి గ్రామాల నుంచి పెద్ద ఎత్తున కావిళ్లతో గిరిజన రైతులు చింతపండును మోసుకు వచ్చారు. బుట్ట నాణ్యతగా ఉండడంతో గతంలో వలే మంచి ధర పలుకుతుందని ఆశించారు. తీరా సంతలో కొనుగోలుదారులు కరువయ్యారు. 30 కిలోలకు పైబడిన కావిడి చింతపండు ధర గతవారం రూ.రెండు వేల నుంచి రూ.రెండువేల నాలుగు వందల వరకు పలికింది. ఈ వారం అంతకంటే ఎక్కువ దక్కుతుందని ఆయా రైతులు భావించారు. అయితే సరకు ఎక్కువగా రావడం, కొనుగోలు చేసేవారు ఆ స్థాయిలో లేకపోవడంతో చేసేదిలేక ఈ వారం ఉదయం సంత ప్రారంభంలో ముప్పై కిలోల కావిడిని రూ.1200లకు విక్రయించారు. మరి కాస్త సమయం గడిచాక ఆ ధర రూ.వెయ్యికి పడిపోయింది దీంతో కొండకోనల నుంచి అష్టకష్టాలుపడి సంతకు తెచ్చిన చింతపండును తిరిగి వెనక్కి తీసుకు వెళ్లలేక వ్యాపారులు అడిగిన ధరకు విక్రయించి నిరాశగా ఇంటిముఖం పట్టారు.

రాష్ట్రంలో అరాచక పాలనను అంతమొందించాలి

- మాజీ మంత్రి దాడి వీరభద్రరావు



ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను సత్కరించిన దాడి వీరభద్రరావు, రత్నాకర్, జయవీర్

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 15: ప్రస్తుతం రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగుతుందని, దీనిని అంతమొందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని మాజీ మంత్రి దాడి వీరభద్రరావు అన్నారు. సోమవారం స్థానిక వీవీ రమణ రైతుభారతి హాల్‌లో దాడి వీరభద్రరావు అభిమానుల ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. తొలుత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా దాడి వీరభద్రరావు మాట్లాడుతూ కనీసం రహదారులు నిర్మించలేని దౌర్భాగ్య స్థితిలో ప్రభుత్వం ఉందన్నారు. అనకాపల్లి నుంచి గతంలో ఎమ్మెల్యేగా గుడివాడ అమర్‌నాథ్‌ను గెలిపించి పెద్ద తప్పు చేశానన్నారు. భవిష్యత్తులో అటువంటి తప్పు జరగకుండా చూసుకోవాలన్నారు. అమర్‌నాథ్ హయాంలో అనకాపల్లి నియోజకవర్గంలో భారీ అవినీతి జరిగిందన్నారు. ఆర్ఈసీఎస్‌ను ఈపీడీసీఎల్‌లో విలీనం కావడానికి తానే ప్రధాన కారణమన్నారు. బోర్డులో విలీనం కావడం వల్ల ప్రతి నెలా రూ.200 కోట్లు ఆదాయం మిగులుతుందన్నారు. ఆర్ఈసీఎస్‌లో అవినీతికి పాల్పడిన వారిని వదిలేదని లేదన్నారు. రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశంపార్టీ తరుపున దాడి కుటుంబమంతా ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల విజయానికి శాయిశక్తులా కృషి చేస్తానన్నారు. ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో బీజేపీ కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందన్నారు. తాను స్థానిక వ్యక్తిని కాకపోయినప్పటికీ నియోజకవర్గంలోని సమస్యలన్నీ తనకు తెలుసునని వాటిని డిల్లీ స్థాయిలో వినిపించే సత్తా తనకుందన్నారు. జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ అనకాపల్లిలో 40 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ చరిత్రలో దాడి వీరభద్రరావు, తాను వేర్వేరు పార్టీల్లో ఉండి ప్రత్యర్థులుగా ఉన్నప్పటికీ మా మధ్య ఆత్మీయ అనుబంధం ఉందన్నారు. తామిద్దరం కలవాలని ఎప్పటి నుంచో చాలా మంది కోరుకున్నప్పటికీ అది ఈరూపేణా నిజమైందన్నారు. మా కలయిక అనకాపల్లి అభివృద్ధికి ఎంతో దోహదపడుతుందన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన టీడీపీ నాయకుడు దాడి రత్నాకర్ మాట్లాడుతూ దాడి వీరభద్రరావు, కొణతాల రామకృష్ణ వేర్వేరు పార్టీల్లో ఉన్నప్పటికీ ఎంతో ఉత్తమమైన రాజకీయాలు నడిపి అనకాపల్లి అభివృద్ధికి బాటలు వేశారన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, టీడీపీ యువ నాయకుడు దాడి జయవీర్, లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ, సీఎం రిత్విక్, తమ్మన సుబ్బారావు, అధికసంఖ్యలో దాడి అభిమానులు పాల్గొన్నారు. అంతకుముందు టీడీపీలో ఉన్నత స్థానాలకు ఎంపికైన మాజీ మంత్రి దాడి వీరభద్రరావు, దాడి రత్నాకర్‌లను సీఎం రమేష్, కొణతాల రామకృష్ణ సత్కరించారు. అలాగే ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులిద్దరినీ దాడి వీరభద్రరావు, రత్నాకర్, జయవీర్ సత్కరించారు.

ఎన్నికల శిక్షణ తరగతులు పరిశీలించిన కలెక్టర్



పాయకరావుపేటలో పీవోలు, ఏపీవోలు రూమ్‌లో లేకపోవడంతో వెళ్లిపోతున్న జిల్లా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి



ఎలమంచిలిలో పీవో, ఏపీవోలకు సూచనలిస్తున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

పాయకరావుపేట, ఏప్రిల్ 15: ఎన్నికల సిబ్బందికి సోమవారం నిర్వహించిన శిక్షణ తరగతులను జిల్లా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి పరిశీలించారు. అయితే ఆయన వచ్చిన సమయానికి ఆర్‌వోలు, ఏఆర్‌వోలు భోజనం చేసేందుకు వెళ్లిపోవడంతో కలెక్టర్ వెనుతిరిగి వెళ్లిపోయారు. పాయకరావుపేట నియోజకవర్గంలో పోలింగ్ కేంద్రాల్లో విధులు నిర్వహించనున్న పోలింగ్ ఆఫీసర్లు, అసిస్టెంట్ పోలింగ్ ఆఫీసర్లకు సోమవారం పట్టణంలోని శ్రీప్రకాష్ విద్యా సంస్థల్లో శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌ఓ కె.గీతాంజలి మాట్లాడుతూ నియోజకవర్గంలో పీఓలు, ఏపీఓలు కలిపి 777 మందికి ఎన్నికల నిర్వహణపై థీరీ, ప్రాక్టికల్ శిక్షణ ఇవ్వాల్సి ఉందన్నారు. తొలి రోజు సోమవారం 373 మందికి శిక్షణ ఇస్తున్నామన్నారు. రెండో రోజు 392 మందికి శిక్షణ ఇవ్వనున్నామని ఆమె తెలిపారు. అయితే సోమవారం జరిగిన శిక్షణ తరగతులను పరిశీలించేందుకు జిల్లా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి పాయకరావుపేట మధ్యాహ్నం 1.30 గంటలకు వచ్చారు. ఆయన నేరుగా తరగతులు నిర్వహిస్తున్న రూమ్‌కు వెళ్లారు. అయితే అప్పటికే మధ్యాహ్నం భోజన విరామ సమయం కావడంతో పీఓలు, ఏపీఓలు భోజనం చేసేందుకు వెళ్లిపోయారు. దీంతో అసంతృప్తికి గురైన కలెక్టర్ ఏమీ మాట్లాడకుండానే శిక్షణ నిర్వహణపై ఆర్‌ఓ గీతాంజలిని వివరాలు అడిగి వెంటనే వెనుతిరిగారు. శిక్షణ తరగతులు పరిశీలించేందుకు కలెక్టర్ వస్తున్నారన్న సమాచారం ఉన్నా ఆర్‌ఓ, ఏఆర్‌ఓలు ఆయన వచ్చిన సమయానికి పీఓలు, ఏపీఓలు ఉండేలా చూసుకోకపోవడం గమనార్హం.

పీవో, ఏపీవోలు లేకపోవడంతో వెనుదిరిగిన రవి పట్టన్‌శెట్టి

పీవో, ఏపీవోలకు కలెక్టర్ సూచనలు

ఎలమంచిలి: పట్టణంలోని గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్‌ను జిల్లా కలెక్టరు రవి పట్టన్‌శెట్టి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సార్వత్రిక ఎన్నికల నిర్వహణపై అధికారులకు పలు సూచనలు చేశారు. స్ట్రాంగ్ రూమ్ వద్ద కట్టుదిట్టమైన నిఘా ఉండాలని, భద్రతా ఏర్పాట్లపై రిటర్నింగ్ అధికారి మనోరమకు సూచించారు. అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పీఓ, ఏపీఓలకు రెండు రోజులు పాటు నిర్వహించే శిక్షణ తరగతులను కలెక్టరు పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలలో సిబ్బంది పాటించాల్సిన నియమ నిబంధనలపై సూచనలిచ్చారు. ఈవీఎంలు, వీవీపాట్‌లపై పూర్తి అవగాహన ఉండేలా శిక్షణలో తెలుసుకోవాలన్నారు.

నర్సీపట్నంలో..

నర్సీపట్నం: ఎన్నికల నిర్వహణకు సంబంధించి పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం జరిగిన పీవోలు, ఏపీవోల శిక్షణ శిబిరాన్ని జిల్లా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి సందర్శించారు. తొలుత ఇక్కడ ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తు స్వీకరణ విభాగాన్ని పరిశీలించారు. అనంతరం 333 మంది పీవోలు, ఏపీవోలకు జరుగుతున్న శిక్షణ తరగతులను పరిశీలించి పలు సూచనలు చేశారు. గత ఎన్నికల్లో పనిచేసిన అనుభవం ఎంత మందికి ఉందని అడిగి తెలుసుకున్నారు. ట్రైనింగ్ ప్రోగ్రామ్ వీడియో చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రిటర్నింగ్ ఆఫీసర్ హెచ్‌వీ జయరాం, తహసీల్దార్ శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు ఈడీ కార్యాలయం ముట్టడి

- తక్షణమే కార్మికులకు వేతనాలు చెల్లించాలని డిమాండ్
- ఇంటక్ నాయకుల ఆధ్వర్యంలో నిరసన



ఈడీ (వర్క్స్) కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఇంటక్ నాయకులు, కార్మికులు

ఉక్కుటౌన్‌షిప్, ఏప్రిల్ 15: ఉక్కు కర్మాగారం కార్మికులకు తక్షణమే వేతనాలు చెల్లించాలని డిమాం డ్ చేస్తూ ఇంటక్ ఆధ్వర్యంలో సోమవారం ఈడీ (వర్క్స్) కార్యాలయాన్ని ముట్టడించారు. ఉక్కు ఉద్యోగులకు ఈ నెల సగం జీతాలే చెల్లించారని, మిగతా మొత్తాన్ని తక్షణమే అందించాలంటూ ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్ మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా కార్మికులకు సగం జీతం ఇవ్వడం దారుణమన్నారు. కార్మికుల సమస్యలపై గుర్తింపు యూనియన్ తమకేమీ పట్టనట్టు వ్యవహరించడం శోచనీయమన్నారు. సంస్థ ప్రగతి కోసం అహర్నిశలు శ్రమిస్తున్న కార్మిక వర్గానికి తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. అన్నీ సెయిల్ మాదిరిగానే చేపడతామన్న ఉక్కు యాజమాన్యం ఇప్పుడు నూతన వేతనాల విషయంలో మాత్రం చేతులెత్తేసి కార్మికులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుందని మండిపడ్డారు. ఉద్యోగుల జీతాల కింద రూ.వంద కోట్లు ఇవ్వలేని స్థితిలో ప్లాంట్ లేదని, యాజమాన్యం కావాలనే తాత్సారం చేస్తుందని రాజశేఖర్ ఆరోపించారు. అనంతరం సీజీఎం (వర్క్స్) కార్యాలయాన్ని కూడా నాయకులు, కార్మికులు ముట్టడించారు. జీతాలు ఇస్తేనే ఇక్కడ నుంచి కదులుతామంటూ ఉదయం నుంచి సాయంత్రం వరకు భీష్మిం చుకు కూర్చున్నారు. కార్మికుల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని సీజీఎం శ్రీధర్ వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్లాంట్ అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు, నాయకులు కారు రమణ, జీవీ సుబ్బయ్య, కె.అవతారం, గోపాల్‌రాజు, జి.గురుమూర్తి, ఎం.గోపి నారాయణ, పీవీ నగేశ్, పోతారెడ్డి, మొల్లి ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సీనియర్ నాయకులను కలిసిన తాతయ్యబాబు



అయ్యన్నపాత్రుడుకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న తాతయ్యబాబు

బుచ్చెయ్యపేట/నర్సీపట్నం, ఏప్రిల్ 15: మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు, తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత, మాజీ ఎంపీ పప్పల చలపతిరావులను టీడీపీ అనకాపల్లి పార్లమెంట్ అధ్యక్షుడిగా నియామకమైన బత్తుల తాతయ్యబాబు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ఆయనను ఆదివారం ఈ పదవికి ఎంపిక చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు తాతయ్యబాబు జిల్లాలోని ముఖ్య నాయకులను కలిసి, జిల్లాలో పార్టీ బలోపేతానికి తనకు సహాయ సహకారాలు అందించాల్సిందిగా వారిని కోరారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	105.00
లైవ్ ధర	125.00
విత్ స్కిన్	220.00
స్కిన్ లెస్	230.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	419
విజయనగరం	423
శ్రీకాకుళం	423

అభిమానుల సహకారం గొప్పది

- వారి వల్లనే సినీరంగంలో ఉన్నతస్థాయికి చేరాను
- ప్రముఖ సినీనటుడు సుమన్ వెల్లడి
- శివశక్తి క్షేత్రం సమీపంలో ఉచిత ఆస్పత్రి నిర్మాణానికి శంకుస్థాపన



చిక్కుడుపాలెంలో శివశక్తిక్షేత్రం ఆలయాన్ని సందర్శించిన సినీ నటుడు సుమన్

నాతవరం, ఏప్రిల్ 15: సినీ రంగంలో తనకు ఎవరి సపోర్టు లేకుండా అభిమానుల సహకారంతోనే ఉన్నతస్థాయికి ఎదిగానని ప్రముఖ సినీనటుడు సుమన్ తెలిపారు. మండలంలోని గుమ్మిడిగొండ పంచాయతీ శివారు చిక్కుడుపాలెం తాండవ నది సమీపంలో ఉన్న శివశక్తి క్షేత్రం వద్ద ఆలయ ధర్మకర్త కేఎస్ఆర్ శర్మ ఆధ్వర్యంలో చేపట్టే 50 పడకల ఉచిత ఆస్పత్రి నిర్మాణానికి సోమవారం ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. ఇప్పటివరకు వంద తెలుగు సినిమాలు, 25 కన్నడ సినిమాలు, ఇతర భాషల్లో 750 సినిమాల్లో తాను నటించినట్టు చెప్పారు. అన్నమయ్య చిత్రం తనకు మంచి గుర్తింపు తెచ్చిందన్నారు. ఈ సినిమా షూటింగ్ సమయంలో ఉపవాసం చేసి ఎంతో నిష్టతో వేంకటేశ్వరస్వామి పాత్రను వేశానన్నారు. ఇక్కడి ఆలయ ప్రాధాన్యతను సినీ ప్రముఖులకు తెలియజేస్తానని వివరించారు. అనంతరం ఆయన చిక్కుడుపాలెంలోని భూగర్భ శివాలయాన్ని సందర్శించుకున్నారు. ఆలయ విశిష్టతను ధర్మకర్త శర్మ వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కరాటే సంఘం అధ్యక్షుడు సతీష్, వెలగా నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఎండ తీవ్రత



సందడి లేని అనకాపల్లి రింగురోడ్డు

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 15: అనకాపల్లిలో ఎండ తీవ్రత అధికంగా ఉంది, వడగాడ్పులు కొనసాగుతున్నాయి. దీంతో పట్టణ ప్రజలే కాకుండా వివిధ పనులపై వచ్చే గ్రామీణ ప్రాంత ప్రజలు కూడా ఇబ్బందులు పడుతున్నారు. ఆదివారం అత్యధిక ఉష్ణోగ్రత 39 డిగ్రీలు నమోదైంది. అయితే సోమవారం ఈ ఉష్ణోగ్రత 37.5 డిగ్రీలకు తగ్గినా వడగాడ్పులు తగ్గకపోవడంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నిత్యం రద్దీగా ఉండే పలు రహదారుల్లో జనసందడి తగ్గింది. సామాన్య ప్రజలు కూడా ఇళ్లల్లోంచి ఈ ఎండకు భయపడి బయటకు వచ్చేందుకు సహసించడం లేదు.

దళితులను మోసం చేసిన వైసీపీ ప్రభుత్వం

- కూటమి ప్రభుత్వం రాగానే న్యాయం చేస్తాం
- బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ హామీ



మాట్లాడుతున్న బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్

కొత్తూరు, ఏప్రిల్ 15: దళితులను వైసీపీ ప్రభుత్వం మోసం చేసిందని, టీడీపీ,బీజేపీ, జనసేన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వారందరికీ న్యాయం చేస్తామని బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ హామీ ఇచ్చారు. సోమవారం అనకాపల్లి పట్టణంలోని ప్రైవేటు కల్యాణ మండపంలో టీడీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి సబ్బవరపు గణేష్ అధ్యక్షతన జరిగిన దళిత ఆత్మీయ సమావేశంలో అయన మాట్లాడారు. దళితుల సంక్షేమం కోసం టీడీపీ అమలు చేసిన 27 పథకాలను రద్దు చేసిన ఘనత వైసీపీ ప్రభుత్వానిదేనన్నారు. మాస్కులు లేవని ప్రశ్నించిన ఒక డాక్టర్‌ను పిచ్చివాడు అనే ముద్ర వేసి చంపిన దుర్మార్గపు ప్రభుత్వం వైసీపీ అని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వానికి ప్రజలంతా ఓటు అనే ఆయుధంతో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. అంబేడ్కర్ విదేశీ విద్య పథకాన్ని రద్దు చేయడం ద్వారా అనేక మంది యువత ఉన్నత విద్యకు దూరమయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు కమలం గుర్తుపై, అసెంబ్లీ అభ్యర్థి కొణతాల రామకష్ణకు గాజు గ్లాసు గుర్తుపై ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, కోట్ని బాలాజీ, దూలం గోపీ, పావాడ కామరాజు, కోన అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

దువ్వాడ మీదుగా బెంగళూరు, గువాహటి ప్రత్యేక రైలు

విశాఖపట్నం, ఏప్రిల్ 15: వేసవి ప్రయాణికుల సౌకర్యార్థం వయా దువ్వాడ మీదుగా బెంగళూరు, గువాహటి మధ్య ప్రత్యేక రైలు ప్రవేశపెడుతున్నట్టు సీనియర్ డీసీఎం ఏకే త్రిపాఠి తెలిపారు. 06521 నంబరు గల రైలు ఈనెల 16 నుంచి జూన్ 25 వరకు ప్రతి మంగళవారం రాత్రి 11.40 గంటలకు బెంగళూరులో బయలుదేరి మర్నాడు సాయంత్రం 6.18 గంటలకు దువ్వాడ, శుక్రవారం ఉదయం 4.50 గంటలకు గువాహటి చేరుతుంది. తిరిగి రైలు ఈనెల 20 నుంచి జూన్ 29 వరకు ప్రతి శనివారం ఉదయం 6.15 గంటలకు గువాహటిలో బయలుదేరి ఆదివారం మధ్యాహ్నం 3.08 గంటలకు దువ్వాడ, సోమవారం ఉదయం 10.55 గంటలకు బెంగళూరు చేరుతుంది.


సమావేశంలో మాట్లాడుతున్న రమేశ్‌నాయుడు

రావణ పాలనకు చరమగీతం పాడాలి

▸▸ పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి రమేశ్‌నాయుడు

కొయ్యూరు, ఏప్రిల్ 15: రాష్ట్రంలో సాగుతున్న రావణ పాలనకు చరమగీతం పాడాలని పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కె.రమేశ్‌నాయుడు పిలుపునిచ్చారు. బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కృష్ణారావుతో కలసి కొయ్యూరు, మంప, రాజేంద్రపాలెం, శింగవరం, కొమ్మిక, కంఠారం, బాలారం తదితర పంచాయతీల్లో సోమవారం ఆయన పర్యటించారు. ప్రతీ పంచాయతీలోనూ జనసేన, బీజేపీ, తెలుగుదేశం పార్టీ నాయకులతో పరిచయ కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. మంప, కొయ్యూరు, శింగవరంలో జయహో బీసీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభల్లో రమేష్‌నాయుడు మాట్లాడుతూ రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి పొత్తులతో ఎన్నికల రణ రంగంలోకి దిగామన్నారు. ఇందుకు అందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం, బీజేపీ, జనసేన నాయకులు జి.సత్యనారాయణ, శ్రీరామూర్తి, రామ్మూర్తి, అప్పలరాజు, అరిమెల రాజు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీని గెలిపించి అభివృద్ధికి తోడ్పడండి

జి.మాడుగుల, ఏప్రిల్ 1: రానున్న ఎన్నికల్లో కూటమి అభ్యర్థి కిల్లు వెంకటరమేశ్ నాయుడును గెలిపించి అభివృద్ధికి తోడ్పడాలని ఎస్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోమెలి చిట్టిబాబు కోరారు. కూటమి నాయకులతో కలిసి కె.కోడాపల్లి పంచాయతీలోని పలు గ్రామాల్లో సోమవారం పర్యటించి గిరిజనులతో సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ ప్రవేశపెట్టిన పథకాలను ప్రజలకు వివరించారు. వైసీపీ ప్రభుత్వంలో పెరిగిన ధరలు, సామన్యులపై భారంపై అవగాహన కల్పిస్తూ.. కూటమి అభ్యర్థులకు మద్దతు తెలపాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కొండపల్లి పిన్నయ్యదొర, నాయకులు ఎస్.నాగబ్బాయి, ఎం.లక్ష్మణ్‌రావు, నారాయణరాజు, జనసేన నాయకులు భీమన్న, వెంకటరమణ, రమణబాబు, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా బలంతో గెలుస్తా: గిడ్డి ఈశ్వరి

జి.మాడుగుల, ఏప్రిల్ 15: ప్రజా బలంతో గెలిచి సత్తా చాటుతానని పాడేరు మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి చెప్పారు. సోమవారం ఇక్కడి కార్యాలయం ప్రారంభించి ఆమె మాట్లాడారు. పార్టీకి పరిచయం లేని వ్యక్తికి టికెట్ కట్టబెట్టడం సరికాదని, టీడీపీ అధిష్ఠానం పునరాలోచించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పి.భీంబాబు, కొండలరావు, చిరంజీవినాయుడు నితిన్ కుమార్, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న గిడ్డి ఈశ్వరి

సీతారాముల కల్యాణానికి ముహూర్తపు రాట

చింతపల్లి, ఏప్రిల్ 15: మండల కేంద్రంలోని రామాలయంలో సీతారాముల కల్యాణానికి ముహూర్తపు రాట వేశారు. నాలుగు రోజుల పాటు జరిగే శ్రీరామనవమి ఉత్సవంలో భాగంగా మంగళవారం లక్ష్మీగణపతి హోమం, బుధవారం సీతారాముల వారి కల్యాణం, గురువారం అన్నసమారాధన నిర్వహిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త మాదబత్తుల సత్తిబాబు, వర్తక సంఘం ప్రధాన కార్యదర్శి పెదిరెడ్ల బేతాళుడు, ఆలయ కమిటీ సభ్యులు ఎంవీ రమణమూర్తి, తాడి రమణ, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


పెళ్లి రాటను వేస్తున్న భక్తులు

కార్యకర్తల ఒత్తిడితో స్వతంత్రంగా పోటీ

▸▸ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు సుబ్బారావు


తామరాపల్లి సమావేశంలో మాట్లాడుతున్న సుబ్బారావు

చింతపల్లి, ఏప్రిల్ 15: కార్యకర్తల ఒత్తిడి మేరకు పాడేరు అసెంబ్లీ స్థానం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నట్టు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు వంతల సుబ్బారావు చెప్పారు. ఎ.శనివారం పంచాయతీ తామరపల్లి గ్రామంలో సోమవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీని నమ్ముకుని పనిచేస్తున్న తనకు కాకుండా, ఆఖరి నిమిషంలో పార్టీలో చేరిన బుల్లిబాబును పార్టీ అభ్యర్థిగా ప్రకటించడంతో కార్యకర్తలు, నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారన్నారు. స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయాలని వారంతా పట్టుబట్టారన్నారు. ఈ మేరకు ఎన్నికల్లో రెబల్ అభ్యర్థిగా పోటీ చేస్తానని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో పీఏసీఎస్ మాజీ డైరెక్టర్ మొట్టడం బాలరాజు, మాజీ సర్పంచ్ బొజ్జన్న, నాయకులు సత్యనారాయణ, గురుమూర్తి, చిరంజీవి పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోండి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో ఉమామహేశ్వరరావు

గూడెంకొత్తవీధి, ఏప్రిల్ 15: గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా పంచాయతీ కార్యదర్శులు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో ఉమామహేశ్వరరావు ఆదేశించారు. వేసవి ప్రణాళికపై సోమవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో అందుబాటులో ఉన్న చేతిపంపులు, బావులు, మంచినీటి పథకాలు పూర్తి స్థాయిలో వినియోగంలో ఉండాలని స్పష్టం చేశారు. మంచినీటి పథకాలు, చేతిపంపులు మరమ్మతులకు గురైతే వెంటనే బాగుచేయాలన్నారు. ఏ గ్రామంలోనూ ఆదివాసీలు నీటి కోసం ఇబ్బందిపడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నీటి సమస్యలపై మండల పరిషత్ కార్యాలయం, పంచాయతీ కార్యదర్శులను ప్రజలు సంప్రదించవచ్చన్నారు. అలాగే ఇంటి పన్నులను కార్యదర్శులు పూర్తి స్థాయిలో వసూలు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఈవోపీఆర్‌డీ పాపారావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ భగవంతరావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనల ఉల్లంఘనపై కేసులు

కొయ్యూరు, ఏప్రిల్ 15: ఎన్నికల నియామవళిని ఉల్లంఘించారని పాడేరు అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి కిల్లు రమేష్‌నాయుడుపై రెండు కేసులు నమోదు చేసినట్టు కొయ్యూరు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు. ఆదివారం మండలంలో పర్యటించిన రమేష్‌నాయుడు ఎన్నికల రిటర్నింగ్ అధికారి నుంచి అనుమతి లేకుండా పలు గ్రామాలలో ప్రచారం నిర్వహించారన్నారు. అలాగే అనుమతి సమయం ఐదు గంటలతో ముగియగా, రాత్రి 9 గంటల వరకు ప్రచారం నిర్వహించారని మరో కేసు నమోదు చేయటం జరిగిందన్నారు. కాగా, మావోయిస్టులు బంద్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో ప్రాబల్య ప్రాంతంగా గుర్తించిన మంపలో పోలీసు అనుమతి లేకుండా పర్యటించారని కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.

మారుమూల పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి

▸▸ నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోండి: ఏఎస్పీ ధీరజ్

ముంచంగిపుట్టు, ఏప్రిల్ 15: మారుమూల పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టిసారిస్తున్నామని అల్లూరి జిల్లా ఏఎస్పీ కె.ధీరజ్ తెలిపారు. సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. సార్వత్రిక ఎన్నికల నిర్వహణ, ప్రస్తుతం మండలంలో పరిస్థితులు తదితర అంశాలపై స్థానిక పోలీసు అధికారులతో చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు అన్ని వర్గాల వారు తమవంతు సహకారం అందించాలని కోరారు. మండలంలోని అత్యంత మారుమూల బూసిపుట్టు పంచాయతీ కేంద్రంలో నూతనంగా పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్టు చెప్పారు. గతంలో ఆ ప్రాంతీయులు మద్దులబంధ గ్రామానికి వచ్చి ఓటు హక్కును వినియోగించుకొనేందుకు ఇబ్బందులు పడేవారని, ఇప్పుడు ఎటువంటి అవస్థలు లేవని, స్వచ్ఛందంగా పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన సూచించారు. మారుమూల బుంగాపుట్టులో పోలింగ్ కేంద్రం లేకపోవడంతో స్థానికులు ఓటు వినియోగించుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారని విలేకరులు ఏఎస్పీ దృష్టికి తీసుకువెళ్లగా, ఆయన సానుకూలంగా స్పందించారు. వివిధ కారణాలతో బుంగాపుట్టు, రంగబయలులో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయలేకపోయామని, ప్రత్యామ్నాయంగా ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రాలకు ఓటర్లను తీసుకువెళ్లేందుకు వాహనాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఓటర్లు నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని, ఎటువంటి ఇబ్బందులు తలెత్తినా తన దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఏఎస్పీ ధీరజ్, పక్కన సీఐ, ఎస్‌ఐ

రాత్రి వేళల్లో అనవసరంగా బయట తిరగొద్దు

మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో రాత్రి 12 గంటలు దాటిన తరువాత అనవసరంగా బయట తిరగరాదని ఏఎస్పీ ధీరజ్ సూచించారు. అకారణంగా రాత్రి వేళల్లో బయట సంచరిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఇటీవల జరిగిన భారీ చోరీ నేపథ్యంలో రాత్రి వేళల్లో దొంగతనాలు జరగకుండా ప్రత్యేక దృష్టిసారిస్తున్నామని, రాత్రి గస్తీతో పాటు పోలీస్ పెట్రోలింగ్ నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జి.మాడుగుల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆర్.రమేష్, ఎస్‌ఐ కె.రవీంద్ర ఉన్నారు.

పశు సంపద సంరక్షణకు ప్రత్యేక కార్యాచరణ

▸▸ పశువులు, మేకలు, గొర్రెలు టీకాల పంపిణీ

▸▸ జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి నరసింహులు

చింతపల్లి, ఏప్రిల్ 15: జిల్లాలో పశు సంపద సంరక్షణకు ప్రత్యేక కార్యాచరణ ప్రారంభించామని జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి సిహెచ్.నరసింహులు చెప్పారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో పశు వైద్యాధికారులు, క్షేత్ర స్థాయి ఉద్యోగులతో సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జబ్బవాపు, గొంతువాపు వ్యాధులు వ్యాప్తి చెందకుండా టీకాలు వేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. వ్యాధులు సోకితే వెంటనే చికిత్స అందిస్తామన్నారు. కోళ్లలో కొక్కెర తెగులు నివారణకు టీకాలు వేస్తున్నామన్నారు. జంతువుల నుంచి మానవులకు వ్యాప్తి చెందే అంటురోగాలను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. రైతులకు పశు కిషాన్ క్రెడిట్ కార్డులు పంపిణీ చేస్తున్నామని, జిల్లాకు వెయ్యి కార్డులు ఇవ్వాలని లక్ష్యంగా చేసుకున్నామని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా పశువులకు మెరుగైన చికిత్స అందించేందుకు 44 పశు వైద్యశాలలు, 299 ఆర్బీకేలు ఉన్నాయన్నారు. అలాగే పందులకు క్లాసికల్ స్వైన్ ఫీవర్ వేక్సినేషన్ చేస్తున్నామన్నారు. ప్రస్తుతం జిల్లాలో పశుగ్రాసం కొరత లేదని, జి.మాడుగుల, పాడేరులో మాత్రమే కొంత సమస్య ఉందన్నారు. ఈ సమస్యను అధిగమించేందుకు ప్రత్యేక కార్యచరణ రూపొందించామన్నారు. సమావేశంలో చింతపల్లి అసిస్టెంట్ డైరెక్టర్ పి.చంద్రశేఖరరావు, రంపచోడవరం అసిస్టెంట్ డైరెక్టర్ షేక్ అహ్మద్ షరీఫ్, పశు వైద్యాధికారులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ నరసింహులు

బస్సెక్కితే బాదుడే

... 5వ పేజీ తరువాయి

ప్రస్తుతం రూ.30, గాజువాకకు రూ.25 నుంచి రూ.35కి, భీమిలికి రూ.30 ఉంటే ప్రస్తుతం రూ.45 , కొమ్మాదికి రూ.20 నుంచి రూ.40, విశాఖ రైల్వేస్టేషన్ నుంచి తగరపువలస రూ.30 నుంచి రూ.45కి పెంచేశారు. దీని వల్ల ప్రయాణికులపై అదనపు భారం పడింది.

పెంపుపై సామాన్యుల ఆగ్రహం

ఆర్టీసీ బస్సు చార్జీలను ఐదేళ్లలో రెండుసార్లు ఏకంగా 50 శాతం మేరకు పెంచడంపై సామాన్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కూలీలు, ప్రైవేటు ఉద్యోగులు, స్వయంసహాయక వృత్తుల్లో ఉన్న వారంతా అద్దెలు తక్కువగా ఉంటాయనే భావనతో విశాఖ శివారు ప్రాంతాల్లో నివసిస్తారు. వారంతా పనుల కోసం విశాఖనగరానికి నిత్యం బస్సుల్లోనే వచ్చిపోతుంటారు. వచ్చే కూలీ/ వేతనంలో చార్జీలకే ఎక్కువ మొత్తం కేటాయించాల్సిన పరిస్థితి ఎదురవుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పైగా ఆక్యుపెన్సీ రేషియో (ఓఆర్) తక్కువగా ఉందనే కారణంతో పలు రూట్లలో బస్సులను రద్దుచేస్తున్నారని, దీని వల్ల ఆయా ప్రాంతాల వారికి ఆటోలే శరణ్యమవుతున్నాయంటున్నారు. ఆర్టీసీ చార్జీలను పెంచి ఆదాయం సమకూర్చుకోవాలనే వైసీపీ సర్కారు తీరును వారంతా తూర్పారబడుతున్నారు.

డిప్యూటీ సీఎంకు ఝలక్!

... 5వ పేజీ తరువాయి

పదవికి ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి సోమవారం రాజీనామా చేయడం తీవ్ర సంచలనం రేపింది. తన భర్త, ఉప ముఖ్యమంత్రికి కుడి భుజంగా వున్న కిలపర్తి భాస్కరరావుతోపాటు జిల్లా పరిషత్ సీఈవోను కలిసి తన రాజీనామా పత్రాన్ని అందించారు. ఈ పరిణామం వైసీపీకి షాక్‌గా భావిస్తున్నారు.

కిలపర్తి భాస్కరరావు తండ్రి కిలపర్తి సూరి అప్పారావు నియోజకవర్గంలో కీలకనేతగా ఉండడంతోపాటు, మాడుగుల అసెంబ్లీకి గతంలో కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేశారు. ఆయన మరణం తరువాత భాస్కరరావు రాజకీయాల్లోకి వచ్చారు. వైసీపీ తరపున దేవరాపల్లి ఎంపీపీగా ఎన్నికయ్యారు. మండల కేంద్రంలో గట్టి పట్టున్న ఆయన.. కొద్దికాలంగా డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడుతో అంటీముట్టనట్టుగా వ్యవహరిస్తూ వస్తున్నారు. ఈ నేపథ్యంలో వైసీపీ అధిష్ఠానం తొలుత ప్రకటించిన అభ్యర్థుల జాబితాలో బూడి ముత్యాలనాయుడుకు మాడుగుల అసెంబ్లీ టికెట్ కేటాయించింది. అయితే అనకాపల్లి నుంచి ఉమ్మడి అభ్యర్థిగా బీజేపీకి చెందిన సీఎం రమేశ్ బరిలో దిగడంతో.. వైసీపీ పెద్దలు ఇటీవల బూడి ముత్యాలనాయుడును ఆ పార్టీ తరపున అనకాపల్లి ఎంపీ అభ్యర్థిగా ప్రకటించారు. దీంతో మాడుగుల ఎమ్మెల్యే టికెట్ తనకు లభిస్తుందని, ఈ మేరకు తన పేరును ఉప ముఖ్యమంత్రి సిఫారసు చేస్తారని కిలపర్తి భాస్కరరావు భావించినట్టు తెలిసింది. అయితే అనూహ్యంగా ఎమ్మెల్యే టికెట్‌ను బూడి ముత్యాలనాయుడు కుమార్తె ఈర్లె అనూరాధకు పార్టీ అధిష్ఠానం కేటాయించడంతో భాస్కరరావు తీవ్ర నిరాశ చెందారు. అంతకు ముందు వరకు ఉప ముఖ్యమంత్రి దేవరాపల్లి మండలంలో ఏ గ్రామంలో పర్యటించినా సరే భాస్కరరావు ఆయన వెంట తప్పకుండా వుండేవారు. కానీ మాడుగుల టికెట్‌ను అనూరాధకు కేటాయించిన నాటి నుంచి డిప్యూటీ సీఎం వెంట ఆయన కనిపించడంలేదు. పార్టీ కార్యక్రమాలకు సైతం దూరంగా వుంటున్నారు. అంతేకాక డిప్యూటీ సీఎం ఫోన్ చేసినా ఎత్తడంలేదని తెలిసింది. భాస్కరరావు పార్టీ కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొనేలా డిప్యూటీ సీఎం ప్రయత్నాలు చేసినప్పటికీ, ఆయన నుంచి స్పందన లేనట్టు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో కిలపర్తి భాస్కరరావు వ్యవహారంపై ఆదివారం రాత్రి మండలానికి చెందిన పార్టీ ముఖ్యనేతలతో డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు ప్రత్యేకంగా సమావేశం నిర్వహించినట్టు సమాచారం. భాస్కరరావును బుజ్జగించే ప్రసక్తే లేదని, అతనికి ఎంతో ప్రాధాన్యం ఇచ్చినప్పటికీ తనను మోసగించారంటూ డిప్యూటీ సీఎం వ్యాఖ్యలు చేసినట్టు చెబుతున్నారు. అతనితో తెగతెంపులు చేసుకున్నట్టు స్పష్టం చేసినట్టు తెలిసింది. ఈ విషయం తెలుసుకున్న కిలపర్తి భాస్కరరావు, తన భార్య రాజేశ్వరిని వెంటబెట్టుకుని సోమవారం మధ్యాహ్నం విశాఖపట్నం వెళ్లి జడ్పీ సీఈవో ఎం.పోలి నాయుడును కలిశారు. రాజేశ్వరి ఎంపీపీ పదవికి రాజీనామా చేస్తూ, లేఖను ఆయనకు అందజేశారు. ఆరోగ్యం సహకరించకపోవడంతో ఎంపీపీ పదవికి రాజీనామా చేస్తున్నట్టు పేర్కొన్నారు. కాగా ఎంపీటీసీ పదవికి, వైసీపీకి రాజీనామా చేయలేదని భాస్కరరావు, రాజేశ్వరి చెప్పారు.

గ్రూప్-2 విజయమే లక్ష్యంగా కృషి చేయాలి

... 5వ పేజీ తరువాయి

పొందుతున్న అభ్యర్థులకు జాగ్రఫీ పాఠ్యాంశాలను బోధించారు. ఎకనామిక్ సర్వే ఆఫ్ ఏపీపై వారికి అవగాహన కల్పించారు. గ్రూప్-2 మెయిన్స్‌పై వారంతపు పరీక్షలు నిర్వహించాలని ఫ్యాకల్టీలకు ఐటీడీఏ పీవో సూచించారు. ఈ కార్యక్రమంలో సహాయ గిరిజన సంక్షేమాధికారి ఎల్.రజని, అభ్యర్థులు పాల్గొన్నారు.


బూరుగుపుట్టులో ప్రచారం నిర్వహిస్తున్న మైనార్టీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి రవికుమార్

వైసీపీని ఓడించండి.. ప్రజాస్వామ్యాన్ని రక్షించండి

▸▸ బీజేపీ మైనార్టీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి పి.రవికుమార్

పాడేరు రూరల్, ఏప్రిల్ 15: రాష్ట్రంలో అరాచక పాలన సాగిస్తున్న వైసీపీని ఓడించి ప్రజాస్వామ్యాన్ని రక్షించేందుకు ప్రజలంతా ముందుకు రావాలని బీజేపీ మైనార్టీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి పెనుమాక రవికుమార్ పిలుపునిచ్చారు. బీజేపీ కోర్ కమిటీ సభ్యులు కుడుముల వెంకటరమణ ఆధ్వర్యంలో మండలంలోని కురిడిమెట్ట, డేగలపుట్టు, బూరుగుపుట్టు గ్రామాల్లో సోమవారం పర్యటించి బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీల ఉమ్మడి అభ్యర్థులు, అరకు ఎంపీగా కొత్తపల్లి గీత, ఎమ్మెల్యేగా పాంగి రాజారావు, పాడేరు ఎమ్మెల్యే అభ్యర్థిగా టీడీపీ బలపర్చిన కిల్లు వెంకటరమేష్‌నాయుడులను గెలిపించాలని కోరారు. ఒక్క ఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రంలో అవినీతి పాలన సాగిస్తున్నారన్నారు. జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత సాగించిన అవినీతికి పాలనకు సంబంధించిన అనేక విషయాలను ప్రజలకు వివరించారు. వైసీపీని గద్దెదించి రాష్ట్ర ప్రజలను ఆదుకోవాలన్న ఏకైక లక్ష్యంతో మూడు పార్టీలు ఒకటై ఎన్నికలకు సిద్ధమయ్యారన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాపిటిరాజు, రమణ తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన


ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు డెమో నిర్వహిస్తున్న సిబ్బంది

పాడేరు రూరల్, ఏప్రిల్ 15: అగ్నిప్రమాదాల నివారణపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రత్యేకంగా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని అగ్నిమాపక కేంద్ర అధికారి కె.పెంటయ్యనాయుడు తెలిపారు. ఈ నెల 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు నిర్వహించే అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక పీటీడీ కాంప్లెక్స్ ప్రాంగణంలో డెమో నిర్వహించారు. అనంతరం కాంప్లెక్స్‌లో ఉన్న ప్రజలకు అగ్నిప్రమాదాలు సంభవించే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించి కరపత్రాలను పంపిణీ చేశారు. అలాగే పెదబయలు వారపు సంతకు చేరుకొని సంతలో అవగాహన కల్పించి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది ఎల్.బాలకృష్ణ, ఎల్.చంద్రశేఖర్, వెంకటేష్, శివాజీరాజు,పరమేశ్వరరావు, హేమంత్, రవిరాజు, కొండలరావు, రాము, గిరీష్, శివయ్య, త్రినాథ్, రాంబాబు పాల్గొన్నారు.

అప్పు చేసి రోగులకు భోజనాలు

... 5వ పేజీ తరువాయి

ఆస్పత్రిలో 30- 40, ముంచంగిపుట్టు సామాజిక ఆరోగ్య కేంద్రంలో 15- 25మంది ఇన్‌పేషెంట్లుగా ఉంటున్నారు. ఆస్పత్రిలో బస చేసిన రోగి, సహాయకులకు ఏజెన్సీలు అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనాలు పెడుతున్నారు.

భారీ మొత్తంలో బకాయిలు ఇదే ప్రథమం

రోగుల భోజనాలకు సంబంధించిన డైట్ బిల్లులు భారీ మొత్తంలో ప్రభుత్వం బకాయి పడడం ఇదే ప్రథమమని కాంట్రాక్టర్లు అంటున్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో మూడు నెలలకు ఒకసారి కచ్చితంగా డైట్ బిల్లులు విడుదలయ్యేవని, వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తొలి మూడు సంవత్సరాలు ఆరు, ఎనిమిది నెలలకు ఒకసారి బిల్లులు వచ్చాయని చెబుతున్నారు. గత ఏడాది డైట్ బిల్లులు పెంచిన నాటి నుంచి నేటి వరకు కేవలం ఒక నెల మాత్రమే బిల్లు వచ్చిందని, 11 నెలల బకాయి బిల్లులు రావాల్సి వుందని కాంట్రాక్టర్లు చెబుతున్నారు.

నిధులు విడుదలకాకపోతే భోజనాలు బంద్

ఐదు రోజుల్లో రోగులకు సంబంధించిన డైట్ బిల్లులు మంజూరుచేయకపోతే భోజనాలు నిలిపివేస్తామని కాంట్రాక్టర్లు చెబుతున్నారు. బుధవారం నుంచే రోగులకు భోజనాలు నిలిపివేసేందుకు కాంట్రాక్టర్లు సిద్ధపడ్డారు. అయితే జిల్లా అధికారుల ఒత్తిడి మేరకు మరో ఐదు రోజుల పాటు రోగులకు భోజనాలు పెట్టాలని కాంట్రాక్టర్లు నిర్ణయించుకున్నారు. అప్పటికి నిధులు మంజూరుకాకపోతే భోజనాలు పెట్టలేమని చెబుతున్నారు.

☛ సంక్షిప్తంగా..

పాడేరు నియోజకవర్గంలో 250 మంది వలంటీర్లు రాజీనామా

పాడేరు, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో గ్రామ వలంటీర్లు మూకుమ్మడి రాజీనామాలు చేశారు. నియోజకవర్గం పరిధిలోని నాలుగు మండలాల్లో సోమవారం ఒక్క రోజే 250 మంది రాజీమాలు చేశారు. నియోజకవర్గ కేంద్రం పాడేరులో 13, చింతపల్లిలో 163, కొయ్యూరులో 50, గూడెంకొత్తవీధిలో 24 మంది రాజీనామా చేశారు. తమ రాజీనామా పత్రాలను సంబంధిత మండల పరిషత్ అధికారులకు సమర్పించారు. అలాగే రాజీనామాలు చేసిన తామంతా రానున్న ఎన్నికల్లో వైఎస్ఆర్‌సీపీ గెలుపునకు కృషి చేస్తామని ప్రకటించారు. వైసీపీ పథకం ప్రకారం గ్రామ వలంటీర్లను మూకుమ్మడి రాజీనామాలు చేయించి పార్టీకి వినియోగించుకునేందుకే చర్యలు చేపడుతున్నదని విపక్షాలు ఆరోపిస్తున్నాయి.

19న సీలేరులో కంటి వైద్య శిబిరం

సీలేరు, ఏప్రిల్ 15: గూడెంకొత్తవీధి మండలంలోని సీలేరు మేజర్ పంచాయతీలో ఈ నెల 19న కంటి వైద్య శిబిరం నిర్వహిస్తామని శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రి మేనేజర్ ఎం.చంద్రశేఖర్ తెలిపారు. స్థానిక జెన్‌కో కల్యాణ మండపంలో ఏపీ జెన్‌కో ఉద్యోగులకు, వారి కుటుంబ సభ్యులకు, ప్రభుత్వ రంగ పాఠశాలలు, కళాశాలలు, ఉద్యోగులకు ఆరోగ్య భద్రత పథకం ఉన్నవారికి కంటి పరీక్షలను నిర్వహించి అవసరమైన వారికి వైద్య నిపుణులతో ఆపరేషన్లు చేస్తామని చెప్పారు.

నేరాలపై అప్రమత్తత అవసరం: సీఐ

పెదబయలు, ఏప్రిల్ 15: దొంగతనాలు, దారి దోపిడీలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జి.మాడుగుల సీఐ రమేష్‌కుమార్ సూచించారు. మండల కేంద్రంలోని వర్తకులతో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల అంతర్రాష్ట్రాల నుంచి దొంగలు సరిహద్దు ప్రాంతాలైన పెదబయలు, ముంచంగిపుట్టు మండలాల్లో ప్రవేశించినట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం ఉందని, అందరూ అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ప్రధాన కూడళ్లు, ప్రతీ దుకాణం వద్ద వర్తకులు స్వచ్ఛందంగా చెత్త బుట్టలు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. తద్వారా నేరాలకు పాల్పడే వారిని సులువుగా కనుగొనవచ్చన్నారు. అలాగే గ్రామాల్లో కొత్త వ్యక్తులు సంచరిస్తే వివరాలు అడిగి తెలుసుకోవాలన్నారు. లేనిపక్షంలో పోలీసులకు సమాచారం అందించాలన్నారు. అనంతరం సార్వతిక ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో గిరిజనులతో అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సమావేశంలో ఎస్‌ఐ మనోజ్‌కుమార్ పాల్గొన్నారు.

భారత్ ఆదివాసీ పార్టీ అభ్యర్థుల జాబితా విడుదల

పాడేరు రూరల్, ఏప్రిల్ 15: భారత్ ఆదివాసీ పార్టీ పార్లమెంట్, అసెంబ్లీ అభ్యర్థుల మొదటి జాబితాను పార్టీ జాతీయ అధ్యక్షుడు మెట్టడం రాజబాబు విడుదల చేశారు. స్థానిక గిరిజన ఉద్యోగుల సంఘం భవన్‌లో సోమవారం నిర్వహించిన సమావేశంలో అభ్యర్థుల ప్రకటన చేశారు. అరకు పార్లమెంట్ అభ్యర్థిగా మెట్టడం రాజబాబు, ఏలూరు ఎంపీ అభ్యర్థిగా తెల్లం రవిప్రసాద్, అరకు ఎమ్మెల్యే అభ్యర్థిగా డాక్టర్ పి.రామకృష్ణ, కురపాం ఎమ్మెల్యే అభ్యర్థిగా అడ్డాకుల గీతారాణి, పోలవరం ఎమ్మెల్యే అభ్యర్థిగా మిడియం శ్రీనివాసరావులను ప్రకటించారు. మిగిలిన నియోజకవర్గాల అభ్యర్థుల జాబితాను త్వరలోనే ప్రకటిస్తామన్నారు.

108 సూపర్‌వైజర్ మృతితో విషాదం

పాడేరు రూరల్, ఏప్రిల్ 15: అల్లూరి జిల్లా 108 సూపర్‌వైజర్‌గా విధులు నిర్వహిస్తున్న ఇబ్రహీం స్వగ్రామం గాజువాకలో సోమవారం ఆత్మహత్య చేసుకోవడంతో పాడేరు 108 సిబ్బందిలో విషాదఛాయలు అలముకున్నాయి. సహచర ఉద్యోగులతో ఎంతో సరదాగా గడిపే ఇబ్రహీం స్వగ్రామం గాజువాక ఆదివారం ఉదయం ఇంటికి వెళ్లిన తరువాత కుటుంబ కలహాల నేపథ్యంలో సోమవారం ఉదయం ఆత్మహత్యకు పాల్పడ్డారని తెలుసుకుని 108 ఉద్యోగులు కన్నీటి పర్యంతమయ్యారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని వారు కోరారు.

మద్యం సీసాలతో ఒకరి అరెస్టు

ముంచంగిపుట్టు, ఏప్రిల్ 15: మద్యం సీసాలను గోదాములో అక్రమంగా నిల్వ ఉంచిన కేసులో ఒకరిని అరెస్టు చేసినట్టు ఏఎస్పీ ధీరజ్ తెలిపారు. సోమవారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సరిహద్దు ప్రాంతమైన జోలాపుట్టులో ఒక గోదాములో మద్యం విక్రయాలు జోరుగా జరుగుతున్నాయని సమాచారం అందగా, సీఐ రమేష్ ఆధ్వర్యంలో ఎస్‌ఐ కె.రవీంద్ర, పోలీసులు దాడి చేశారన్నారు. బస్తాల చాటున దాచి ఉంచిన 113 మద్యం సీసాలను పోలీసులు గుర్తించారని చెప్పారు. వీటిని స్వాధీనం చేసుకుని వారనాసి మణికేశ్వరరావు, అతని కుమారుడు జగదీష్‌లపై కేసు నమోదు చేసి గాలింపులు చేపడుతున్నట్టు చెప్పారు. ఆ సమయంలో జోలాపుట్టు నుంచి ముంచంగిపుట్టు వైపు వస్తున్న జీపును తనిఖీలు చేయగా, అందులో పరారీలో ఉన్న వారనాసి మణికేశ్వరరావు ఉన్నట్టు గుర్తించి పట్టుకున్నామన్నారు. అతడిని అదుపులోకి తీసుకుని కోర్టుకు తరలించామన్నారు. అతని కుమారుడు జగదీష్ పరారీలో ఉన్నాడని తెలిపారు.

నాటు సారాతో మరో ఇద్దరు...

చింతపల్లి, ఏప్రిల్ 15: మండలంలోని అన్నవరం పోలీసు స్టేషన్ పరిధిలో నాటు సారా తరలిస్తూ పట్టుబడిన ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశామని స్థానిక ఎస్‌ఐ రాజారావు తెలిపారు. సోమవారం నాటుసారా శిబిరాలపై దాడులు నిర్వహించామన్నారు. ఈ మేరకు సోమవరం గ్రామానికి చెందిన వంతల రాజారావు, అన్నవరం గ్రామానికి చెందిన సొంటెల శివలు 30 లీటర్ల సారాతో పట్టుబడ్డారన్నారు. రాజారావు సారా తయారు చేస్తాడని, శివ అన్నవరం తీసుకొచ్చి విక్రయిస్తుంటాడని చెప్పారు. పట్టుబడిన ఇద్దరిపై కేసు నమోదు చేశామని ఆయన తెలిపారు.

చికిత్స పొందుతూ క్షతగాత్రుడి మృతి

సీలేరు, ఏప్రిల్ 16: ఆటో ప్రమాదానికి గురైన సంఘటనలో చికిత్స పొందుతూ కేజీహెచ్‌లో సోమవారం ఒకరు మృతి చెందారని ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. గాలికొండ పంచాయతీలోని సప్పర్ల నుంచి ఆకులూరు గ్రామానికి శనివారం సిమెంట్ లోడ్‌తో వెళ్తున్న ఆటో ఆకులూరు సమీపంలోని ఘాట్ రోడ్డులో అదుపు తప్పి పది అడుగుల లోయలోకి దూసుకుపోయింది. దీంతో వాహనం వెనుక తొట్టిలో ఉన్న పనసలబంద గ్రామానికి చెందిన పాంగి సన్యాసిరావు, వంతల రమేష్, పాంగి బాబి, వంతల రవి, డ్రైవర్ గంగులనాయుడుకు స్వల్ప గాయాలయ్యాయి. పనసలబంద గ్రామానికి చెందిన సన్యాసిరావుకు తీవ్ర గాయాలు తగలడంతో సప్పర్ల పీహెచ్‌సీలో ప్రథమ చికిత్స అనంతరం కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడని చెప్పారు. , దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.